క్లుప్తంగా

ముగిసిన శిక్షణ తరగతులు

చెన్నూర్: శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల అధికారి సిడాం దత్తు అన్నారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సిబ్బంది శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. శిక్షణ తరగతులలో ఓటింగ్ యంత్రాల పనితీరు, మాక్ పోలింగ్, ఎన్నికల నిర్వహణపై సంపూర్ణ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు చంద్రశేఖర్, విశ్వంభర్, మల్లిఖార్జున్, మాస్టర్ ట్రైనర్స్ ఎస్.శ్రీనివాస్, గుండెటి యోగేశ్వర్, దత్తమూర్తి, సురేందర్, లక్ష్మీ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఓటుపై పాటతో అవగాహన

తాండూర్: మండలంలో కళాకారులు ఓటు వినియోగంపై గ్రామీణులకు ప్రచారం చేశారు. మండలంలోని రేచినీ, గజ్జలపల్లి గ్రామాల్లో కూడళ్లు, దుకాణాల వద్ద ఓటు హక్కు ప్రాధాన్యత, వినియోగించుకునే తీరును వివరిస్తూ పాటలు పాడారు. ప్రతి ఓటరూ తప్పక ఎన్నికల్లో ఓటు వేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు రమేష్, శ్రీనివాస్, రవీందర్, రవికుమార్, సత్యనారాయణ, నాగలక్ష్మి, సమీరా, గ్రామీణులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీదేవి

నెన్నెల: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన పలువురు యువకులు, మహిళలు బీజేపీ మండల అధ్యక్షుడు శైలేందర్‌సింగ్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో బుధవారం ఆ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి అమురాజుల శ్రీదేవి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పీఎం నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి చూసి, చాలా మంది బీజేపీలో చేరుతున్నట్లు ఆమె తెలిపారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పులుగం తిరుపతి, నాయకులు రాజులాల్ యాదవ్, కోట వంశీ, లింగంపల్లి అంకులు, కొమ్ము హరీష్, మల్లేష్, కృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు మృతి



లింగయ్య (ఫైల్)

బెల్లంపల్లి: మున్సిపాలిటీ మహ్మద్ ఖాశీం బస్తీలో బుధవారం దుర్శెట్టి లింగయ్య (105) శతాధిక వృద్ధుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. లింగయ్య కొంతకాలం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆరోగ్యం బాగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతడిని పరీక్షించిన వైద్యుడు వయోభారం పైబడటంతో ఆరోగ్యం కుదుట పడే అవకాశాలు లేవని చెప్పాడు. ఇంటికొచ్చిన కొద్ది సేపటి తర్వాత లింగయ్య తుదిశ్వాస విడిచాడు. కాగా లింగయ్యభార్య నర్సమ్మ 25ఏళ్ల క్రితం అకాల మృతి చెందింది. అతడికి ఇద్దరు కొడుకులు కాగా పెద్ద కొడుకు ఎనిమిదేళ్ల క్రితం చనిపోగా, ప్రస్తుతం చిన్న కొడుకు చంద్రయ్య వద్ద ఉంటున్నాడు. లింగయ్య మృతితో బస్తీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సైబర్ నేరాలపై అవగాహన

నెన్నెల: మండల కేంద్రంలో సైబర్‌నేరాలపై బుధవారం నెన్నెల ఎస్సై శ్యాంపటేల్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారని వివరించారు. బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, లోన్లు ఇస్తామని ఆశలు చూపి డబ్బులకు ఎరవేస్తారన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు అపరిచితులతో పంచుకోవద్దన్నారు. ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు చేసే వారు కొత్త వ్యక్తుల మాటలు నమ్మరాదన్నారు. సైబర్ నేరాలకు గురైతే సమాచారం అందించాలన్నారు.

భీమారం: చదువును కేవలం మంచి కోసమే ఉపయోగించాలని ఎస్సై రాజవర్ధన్ విద్యార్థులను కోరారు. పోలీసుల ఆధ్వర్యంలో భీమారంలో బుధవారం గిరిజన ఆశ్రమపాఠశాలలో సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు.

'బీఎస్పీలోకి రావాలని ఆహ్వానం'

మందమర్రిరూరల్: కొంత కాలంగా చెన్నూర్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు టికెట్ దక్కుతుందని ఆశపడి భంగపడిన దాసారపు శ్రీనివాస్, రెండు రోజుల క్రితం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బీఎస్పీలో చేరారు. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న రామిళ్ల రాధికను హైదరాబాద్‌లోని వారి నివాసంలో కలిసి బీఎస్పీలోకి రావాలని దాసారపు శ్రీనివాస్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంపీ గుణ ఆహ్వానించారు. త్వరలో తన నిర్ణయం ప్రకటిస్తానని రాధిక తెలిపారు.

ఏళ్లుగా ఒకే చోట..!



- నిబంధనలకు విరుద్ధంగా బదిలీల ప్రక్రియ
- ఐదేళ్లు దాటినా.. ఏరియాలోనే విధులు
- లాంగ్‌స్టాండింగ్ అధికారులతో అవినీతికి అవకాశం

మందమర్రిరూరల్: సంస్థ నిబంధనలకు విరుద్ధంగా మందమర్రిలోని పలువురు అధికారులు (లాంగ్ స్టాండింగ్) చాలా కాలంగా బదిలీ లేకుండా ఏరియాలోనే విధులు నిర్వర్తిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం అధికారులు ఒక ఏరియాలో కనీసం ఐదు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం విధులు నిర్వర్తించొద్దు. ఏరియాలో జీఎం స్థాయి అధికారి అయితే, కనీసం రెండు నుంచి మూడు సంవత్సరాల్లో బదిలీ అవుతారు. ఏరియాలో జీఎం ఆఫీస్‌లో డీజీఎం(ఐఈడీ), ఐటీ ప్రోగ్రాం ఆఫీసర్ (డిప్యూటీ మేనేజర్), సివిల్ డిపార్ట్‌మెంట్‌లో డీవైఎస్ఈ(సివిల్), ఓసీలో ప్రాజెక్ట్ ఆఫీసర్, కాసిపేట గనిలో మేనేజర్‌తో పాటు పలు విభాగాల్లో విధులు నిర్వర్తించే అధికారులు ఐదేళ్లకు బదిలీ కావాల్సి ఉండగా, మరి ఎందుకు బదిలీకాకుండా ఏరియాలోనే విధులు నిర్వర్తిస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అలాంటి అధికారులు జీఎం స్థాయి అధికారిని మచ్చిక చేసుకుని, సంస్థకు నష్టం కలుగజేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా అలాంటి అధికారులతో ఉద్యోగులకు కూడా ఇబ్బందవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. సివిల్ డిపార్ట్‌మెంట్లో విధులు నిర్వర్తించే సూపర్‌వైజర్స్ కూడా ఏళ్ల తరబడి ఒకేచోట ఉండడంతో అధికారులతో కుమ్మక్కై పలు అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా నిబంధనల ప్రకారం ఐదేళ్లు ఏరియాలో విధులు నిర్వర్తించిన అధికారులను వెంటనే బదిలీ చేయాలని పలు కార్మిక సంఘాల నేతలు, ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

అవినీతి జరిగే అవకాశం ఉంది



సింగరేణి సంస్థలో ఉన్న సీఎండీనే ఏడేళ్లుగా విధుల్లో కొనసాగుతున్నారు. అదే రీతిగా మిగిలిన అధికారుల బదిలీలు కూడా ఉన్నాయి. అనుకూలంగా ఉండే అధికారులకు నిబంధనలు వర్తించకపోవడం శోచనీయం. లాంగ్ స్టాండింగ్ అధికారుల వల్ల కార్మికులపై పెత్తనం చెలాయించడంతో అవినీతి కూడా జరిగే అవకాశం లేకపోలేదు. వెంటనే లాంగ్ స్టాండింగ్ అధికారులను గుర్తించి బదిలీ చేయాలి.

– వెంకటస్వామి, సీఐటీయూ మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు

అవినీతికి ఆస్కారం..

ఏరియాలో నిబంధనలకు మించి లాంగ్‌స్టాండింగ్‌గా విధులు నిర్వర్తిస్తున్న అధికారులతో అవినీతి జరిగే అవకాశం ఉంటుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల మన్ననలు ఉండడం వల్లనే బదిలీ చేయకుండా ఉంచుతున్నారని, ఈ ధీమాతోనే కొంతమంది అధికారులు ఉద్యోగులపై ఆధిపత్యం చెలాయిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్‌ను వివరణ కోరగా అలాంటి విషయాలన్నీ కార్పొరేట్ అధికారులు చూసుకుంటారు. ఎక్కడ.. ఎవరిని రిక్రూట్‌మెంట్ చేయాలన్నా, బదిలీ చేయాలన్నా కార్పొరేట్ అధికారులదే బాధ్యత అన్నారు.

బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు



మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. జిల్లా కేంద్రంలోని ఎడ్లవాడలో, హాజీపూర్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి పార్టీ మేనీఫెస్టోను ప్రజలకు వివరించారు. రెండుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పనిచేసిందని, మరోసారి భారీ మెజారిటీతో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు.

నస్పూర్: పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు దగ్గుల మధుకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్‌వీ విద్యార్థి విభాగం కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే దివాకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీఆర్ఎస్ గెలుపులో యువకులు, విద్యార్థుల పాత్ర చాలా కీలకమన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో పేదల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రజలను ఓట్లు అడగాలని సూచించారు. గెలుపే లక్ష్యంగా సమష్టిగా సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, నడిపల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నడిపల్లి విజిత్‌రావు, బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ నాయకులు చిప్పకుర్తి జగన్, మహ్మద్ సాజిద్, నక్క తిరుపతి, చిట్టి బాద్‌షా, అంజిత్ ఖాన్, రావుల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలి'



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న అభ్యర్థి బొజ్జు

జన్నారం: మండలంలోని చింతలపల్లికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు నాగన్నగౌడ్ 30మంది తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరగా, నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజల్లో కాంగ్రెస్‌పై ఆదరణ పెరుగుతుందని, ఎన్నికల్లో అత్యధికంగా ప్రజల మద్దతు కాంగ్రెస్‌పై ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ, కార్యకర్తలు, నాయకులు పార్టీకోసం సైనికుల్లా పని చేసి గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫసీఉల్లా, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: పేద ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీని అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించి సీఎం కేసీఆర్‌కు బాసటగా నిలవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దుర్గం చిన్నయ్య అన్నారు. పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో బుధవారం జరిగిన బీఆర్ఎస్ బూత్ కమిటీ, పట్టణ కమిటీల సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఘన విజయం సాధించి పెట్టాలని కోరారు. స్థానికేతరుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అనంతరం భీమిని మండలం మల్లిడీ(ఎస్సీ)కాలనీకి చెందిన కోట మల్లేష్, రాజు, శ్రావణ్, నగేష్ తదితరుల ఆధ్వర్యంలో యువకులు గులాబీ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ భీమారం మండలాధ్యక్షుడి రాజీనామా

భీమారం: బీజేపీ విధానాలు నచ్చక మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు వేల్పుల శ్రీనివాస్ బుధవారం ప్రకటించారు. ఈ మేరకు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇన్నాళ్లు బీజేపీ ఎదుగుదల కోసం పనిచేశానని అన్నారు. తన రాజీనామాను జిల్లా అధ్యక్షుడికి పంపించనున్నట్లు ఆయన తెలిపారు.

చెన్నూర్ టికెట్ నేతకానీలకు కేటాయించాలి



మాట్లాడుతున్న దుర్గం ఎల్లయ్య

చెన్నూర్: నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్‌ను నేతకాని సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్ గోమాసకే కేటాయించాలని తెలంగాణ నేతకాని మహార్ కుల హక్కుల సంరక్షణ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం ఎల్లయ్య అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూర్ సీటు ఇతర వ్యక్తులకు ప్రకటించొద్దని, నేతకానీలకే కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్కూరి రాజమల్లు, తిరుపతి, దుర్గం అయిలయ్య, పొట్టల నాగరాజు, కొమ్మెర దుర్గయ్య, కామెర అనూష, లక్ష్మి, సంతోశ్, జనగామ మంగ పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

జన్నారం: ప్రతి వినియోగదారుడు వినియోగదారుల చట్టంపై అవగాహన కలిగి ఉండాలని లేనిచో వినియోగదారుడు నష్టపోయే అవకాశం ఉందని కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో వ్యాపారులతో, వినియోగదారులతో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వినియోగదారులు నిత్యవసర వస్తువులు, కల్తీ వస్తువులు, కల్తీ ఎరువులు, ఆసుపత్రిలో అధిక చార్జీలు, గ్యారంటీ, వారంటీలు, ఎలక్ట్రానిక్ గూడ్స్, ఈ కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్‌ల ద్వారా వినియోగదారులు అధికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మంచిర్యాల జిల్లా కన్వీనర్ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లెడ నరేశ్, ఉపాధ్యక్షుడు సృజన్, సభ్యులు రవి, నర్సయ్య, మహేశ్, హరీష్, వర్తక సంఘం అధ్యక్షుడు మారుతిరాజ్, ప్రధాన కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు



అరుణక్కనగర్‌లో బీజేపీ నాయకుల ప్రచారం

శ్రీరాంపూర్: డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు తెలిపారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జి అంబాలా సాగర్‌తో కలిసి ఆయన శ్రీరాంపూర్‌లోని అరుణక్కనగర్‌లో గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సారి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. విశ్వకర్మ యోజన లాంటి పథకాల ద్వారా కుల వృత్తుల వారిని మోదీ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. శ్రీరాంపూర్ ప్రజలకు జాతీయ రహదారిని ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు రవాణా మెరుగుపర్చారన్నారు. సబ్బండ వర్గాలు అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే సాధ్యమన్నారు. తనకు గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సత్రం రమేష్, ఈర్ల సదానందం, మిట్టపల్లి మొగిలి, రనవేణి శ్రీను, కుర్రే చక్రి, బద్రి శ్రీకాంత్, బూసారపు తిరుపతి, కే శ్రీను, తడూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్‌ను గెలిపించాలని ప్రచారం



కన్నెపల్లిలో ప్రచారం చేస్తున్న అశోక్‌యాదవ్

చెన్నూర్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి ఎమ్మెల్యేగా మళ్లీ బాల్క సుమన్‌ను గెలిపించాలని మంచిర్యాల జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ కొమ్ము అశోక్‌యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం చెన్నూర్ మండల అధ్యక్షుడు అక్కం ఓదన్న ఆధ్వర్యంలో మండలంలోని కన్నెపల్లి గ్రామంలో బుధవారం గడపగడపకూ ప్రచారం నిర్వహించారు.

భీమారం: చెన్నూరు నియోజకవర్గం నుంచి తిరిగి బాల్క సుమన్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ భీమారం మండలం పోతన్‌పల్లిలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గద్దె రాంరెడ్డి, వేముల ప్రణీత్ గౌడ్, పానుగంటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా రవి



రవికి నియామకపత్రం అందిస్తున్న వినోద్

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా బెల్లంపల్లి మండలంలోని బుధాకుర్దు గ్రామానికి చెందిన బత్తుల రవి నియామకమయ్యారు. స్థానికంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ నియామకాన్ని ప్రకటించారు. ఈ మేరకు రవికి నియామకపత్రాన్నీ అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వాణిని వినిపించడానికి పాటు పడాలని అధికార ప్రతినిధికి సూచించారు. రవి నియామకంపై పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అధికార ప్రతినిధిగా తనను నియమించిన వినోద్ ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కొక్కిరాల సురేఖ

మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కోరారు. జిల్లా కేంద్రంలోని 4వ వార్డులో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ హామీలను ప్రజలకు వివరిస్తూ, ఓటు వేయాలని కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. హాజీపూర్, నంనూర్, గుడిపేట గ్రామాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గడపగడపకూ ప్రచారం నిర్వహిచారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావును గెలిపించాలని కోరారు.

అవగాహనతో ప్రమాదాలకు దూరం

- ఆర్కే 5గనిపై రక్షణ పక్షోత్సవాలు



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

శ్రీరాంపూర్: రక్షణ చర్యలపై అవగాహన కలిగి ఉంటే ప్రమాదాలను తగ్గించవచ్చని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. ఆర్కే 5గనిపై బుధవారం రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. రక్షణ తనిఖీ బృందం గనిని సందర్శించి గనిలో రక్షణ చర్యలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గనిపై జరిగిన కార్యక్రమంలో జీఎం మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి రక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం పనిచేయడం వల్ల ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చునన్నారు. రక్షణపై అవగాహన కల్పించేలా యూట్యూబ్, ఫేస్బుక్‌ల ద్వారా ఉద్యోగులు అవగాహన కల్పించడంపై జీఎం అభినందనలు తెలిపారు. అనంతరం తనిఖీ బృందం సభ్యులు గనిలోకి దిగి రక్షణ చర్యలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ ఏవి రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్ ఖాదిర్, తనిఖీ బృందం కన్వీనర్ తివారి, గని రక్షణాధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న అధికారులు, నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనికి చెందిన ఐలయ్య అనే జనరల్ మజ్దూర్ కార్మికుడు ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ కొన్ని రోజుల క్రితం అనారోగ్య సమస్యలతో మరణించాడు. తోటి కార్మికుడి కుటుంబానికి సాయం చేయాలని సింగరేణి డిపార్ట్‌మెంట్ కార్మికులు తమ బాధ్యతగా భావించి రూ.80వేలు జమ చేసి గని మేనేజర్ అల్లావుద్దీన్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. రూ.50వేలు కూతురి పేరు మీద ఫిక్సడ్‌బాండ్ రూపంలో రూ.30వేలు నగదుగా అందించారు. కార్యక్రమంలో ఫోర్‌మెన్ ఒడ్నాల రాజన్న, సతీష్‌యాదవ్, పుప్పాల శ్రీనివాస్, కనుకుల తిరుపతి, మల్లేష్, రఘురాం, సత్యనారాయణ, మూడు షిఫ్టుల ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ కార్మికులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

నేత్రదానానికి అంగీకారం



మంచిర్యాలటౌన్: నేత్రదానం చేసేందుకు సింగరేణిలో న్యూటెక్‌మైన్‌లో సర్దార్‌గా పనిచేసి రిటైర్డ్ ఉద్యోగి కొంకుముట్టి శ్రీనివాస్ ముందుకొచ్చారు. సదాశివ ఫౌండేషన్‌కు ఈ సందర్భంగా బుధవారం తన అంగీకార పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, సలహాదారు నూక రమేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

శ్రీరాంపూర్: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ బాబు తెలిపారు. శ్రీరాంపూర్‌లోని హిమ్మత్ నగర్‌లో కాలనీవాసులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎలాంటి వివాదాలు సృష్టించకుండా, గొడవలు లేకుండా ప్రచారాలు చేసుకోవాలన్నారు. ప్రజలు కూడా ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజేష్ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

లక్సెట్టిపేట: సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 11న జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్ పిలుపునిచ్చారు. లక్సెట్టిపేటలోని ఐబీ గెస్ట్ హౌస్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు బిరుదుల ధర్మయ్య, సుద్దాల శ్రీనివాస్, చెన్న రవి, సాత్రాజ్ కృష్ణ, వేల్పుల శంకర్, జూల రవి, కత్తెరపాక సత్తయ్య, నరేష్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

బెల్లంపల్లిరూరల్: గ్రామీణులు ఆర్థిక అక్షరాస్యతపై విధిగా అవగాహన పెంచుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు బెల్లంపల్లి మార్కెట్ ఏరియా బ్రాంచ్ మేనేజర్ రాజేష్ కన్నా అన్నారు. మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

యజ్ఞాన్ని విజయవంతం చేయండి

చెన్నూర్: కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత హనుమాన్ దీక్ష పీఠం పీఠాధిపతులు దుర్గా ప్రసాద్ స్వామీజీ అన్నారు. తిరుమలతిరుపతి దేవస్థానం, హనుమాన్ దీక్ష పీఠాధిపతుల ప్రత్యేక పర్యవేక్షణలో నిర్వహించే కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞంలో భాగంగా బుధవారం చెన్నూర్‌లోని ప్రతాప్ మారుతీ హనుమాన్ మందిర్‌ను సందర్శించారు. అనంతరం భక్తులకు ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.